క్లుప్తంగా

వన్‌టౌన్ సీఐగా తేజమూర్తి



ఆదోనిఅర్బన్: పట్టణంలోని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ సీఐగా తేజమూర్తి బుధవారం బాధ్యతలు చేపట్టారు. అనంతపురం నుంచి ఆదోనికి బదిలీపై వచ్చారు. ఆయన స్థానంలో ఉన్న సీఐ విక్రమసింహా వైఎస్సార్ కడప జిల్లా బద్వేల్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తేజమూర్తి మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఏ సమస్య వచ్చినా పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని, చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదన్నారు. తాను అన్నమయ్య జిల్లాకు చెందిన వాడినని చెప్పారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

ఆదోనిటౌన్: స్థానిక ఇందిరానగర్‌లోని వేంకటేశ్వరస్వామి దేవాలయం ఏరియాలో నూతన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. దీంతో స్థానిక ప్రజలను వేధిస్తున్న ఓల్టేజీ, సమస్య తీరిందని మహిళలు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కౌన్సిలర్ చలపతి ఆధ్వర్యంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు పనులు జరిగాయి. గత నెలలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డికి స్థానికులు సమస్యను వివరించగా, ఆయన ఆదేశాల మేరకు బుధవారం ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు.

వజ్రోత్సవాలను విజయవంతం చేద్దాం

ఆదోని సెంట్రల్: ఎస్టీయూ 75వ వజ్రోత్సవ సంబరాలను విజయవంతం చేద్దామని సంఘం రాష్ట్ర అదనపు కార్యదర్శి సి.నాగరాజు పిలుపునిచ్చారు. బుధవారం వజ్రోత్సవాలకు సంబంధించిన ప్రచార రథానికి స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 12,13వ తేదీల్లో కర్నూలు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో వేడుకలు జరుగుతాయని తెలిపారు. రాష్ట్ర కౌన్సిలర్ మహాదేవప్ప, జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ నాయుడు, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి సుంకన్న ,పట్టణ జనరల్ సెక్రటరీ ఎస్. భీమ్‌రాజ్, వై. శ్రీరాములు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి

ఆదోనిఅర్బన్: మున్సిపల్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ నాయకులు అజయ్‌బాబు, వెంకప్ప కోరారు. బుధవారం స్థానిక కోట్ల కూడలిలో ధర్నా చేపట్టి గుంజీలు తీసి నిరసన వ్యక్తం చేసి మానవహారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థిని అభినందిస్తున్న క్రికెట్ అసోసియేషన్ సభ్యులు

ఆదోని సెంట్రల్: పట్టణానికి చెందిన యోధ శంకర్‌రెడ్డి జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు ఆదోని తాలూకా క్రికెట్ అసోసియేషన్ ఉద్యక్షుడు విట్టా రమేష్, ఉపాధ్యక్షుడు ముజీబ్, కంబిరెడ్డి తెలిపారు. బుధవారం భీమాస్ హాల్‌లో విద్యార్థిని అభినందించారు. వారు మాట్లాడుతూ ఈనెల 4 నుంచి 7 వతేదీ వరకు పల్నాడు జిల్లా నరసారావు పేటలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-17 ఎస్‌జీఎఫ్‌ఐ క్రికెట్ పోటీల్లో ప్రతిభ చాటాడన్నారు. ఈ నెల 16 నుంచి 22వ తేదీ వరకు పాట్నాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని చెప్పారు. అసోషియేషన్ కార్యదర్శి వెంకటేశ్ సభ్యులు కొల్లి రవి, వెంకటేశ్ బాబు, జేఎం బాషా, జోనాథన్, నారాయణ, కోచ్ బాలాజీ పాల్గొన్నారు.

ఈవీఎంల పనితీరుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఏఈఆర్ఓ వీరభద్రప్ప

ఆదోనిరూరల్ : మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో ఈవీఎంల పనితీరుపై ఏఈఆర్ఓ వీరభద్రప్ప ఆధ్వర్యంలో బుధవారం గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్నికల్లో ఓటు ఎలా వేయాలి, ఎలా బటన్ నొక్కాలి, ప్రింట్ ఎలా వస్తుందని అంశాలను వివరించారు.

వేలం పాట వాయిదా

మద్దికెర: పెరవలి శ్రీరంగనాథస్వామి దేవాలయంలో తలనీలాల వేలంపాట మరోసారి వాయిదాపడినట్లు బుధవారం ఈఓ చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ చైర్మన్ దస్తగిరిగౌడ్ తెలిపారు. ఈనెల 17న నిర్వహిస్తామన్నారు. గతంలో రెండు సార్లు వేలం వేసినా స్పందన లేక జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వాయిదా వేశామన్నారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే లక్ష్యం



కబడ్డీ ఆడుతున్న ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదన్

ఆదోని సెంట్రల్: క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం-ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే వై.సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాల మైదానంలో మండల స్థాయి క్రీడా పోటీలను బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ ఉన్న క్రీడాకారులు ఉన్నారని, అయితే ప్రోత్సాహం లేక వెనుకబడిపోయారని, దీంతో ప్రభుత్వమే పూనుకొని వారిని వెలుగులోకి తేవాలని నిర్ణయించి పోటీలను ప్రారంభించిందన్నారు. చదువు ఎంత అవసరమో క్రీడలు కూడా దైనందిన జీవితంలో భాగం కావాలన్నారు. ఎమ్మెల్సీ మధుసూదన్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. అనంతరం కబడ్డీ, వాలీబాల్, ఖోఖో,బ్యాడ్మింమిటన్ పోటీలను ప్రారంభించారు. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మధుసుదన్ కబడ్డీ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. ఎంపీపీ దానమ్మ, మండల పరిషత్ అధికారి గీతావాణి, డీఎల్‌డీం నాగేశ్వరరావు, ఎంఈఓ బి.శివరాములు, మాజీ ఎంపీపీ పంపాపతి, వ్యాయమ ఉపాధ్యాయులు, గ్రామ వార్డు సచివాలయాల కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. పట్టణంలో వార్డు సచివాలయాల్లో పురపాలక కమీషనర్ రఘునాథరెడ్డి క్రీడా పోటీలను ప్రారంభించారు. అక్షరశ్రీ పాఠశాలలో జరిగిన పోటీల్లో తీసుకోవలసిన జాగ్రతలను వివరించారు.

మంత్రాలయం: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి క్రీడపోటీలు జరిగాయి. ప్రత్యేకాధికారి నారాయణ మూర్తి, నోడల్ ఆఫీసర్ ఎంపీడీఓ మణిమంజరి, సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య జ్యోతి ప్రజ్వలన గావించి క్రీడలను ప్రారంభించారు. కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. నాయకులు రాఘవేంద్ర, మల్లికార్జున, వెంకటేష్ శెట్టి, పరమేష్, జయశ్రీ, ఎంఈఓ మొయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కోసిగి: స్థానిక బాలుర ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో మండలస్థాయి ఆడుదాం ఆంధ్ర పోటీలు నిర్వహించారు. బుధవారం స్థానిక పాఠశాలలో ఎంపీడీఓ రాజేంద్ర ప్రసాద్, పీడీలు ఖలీల్ అహ్మద్, రాజారామ్ ఆధ్వర్యంలో వాలీబాల్, బాల్‌బాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని తాలుకా స్థాయికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు, పీఈటీలు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి



కౌతాళం: కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



మంత్రాలయం: క్రీడాకారులతో అధికారులు

కౌతాళం: గ్రామీణ క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని వెలికితీసి వారిని ప్రోత్సహించడమే లక్ష్యంగా ప్రభుత్వం 'ఆడుదాం – ఆంధ్రా' క్రీడాపోటీలు నిర్వహిస్తోందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన నాయకుడు ప్రదీప్‌రెడ్డి అన్నారు. ఆయన బుధవారం ఎంపీపీ అమరేష్‌తో కలిసి మండల స్థాయి క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారులు సత్తాచాటుకునేందుకు ఇది చక్కని అవకాశం అన్నారు. క్రీడా పోటీల నిర్వహణపై ప్రతిపక్ష టీడీపీ నేతలు విమర్శలు చేయడం బాధాకరమన్నారు. వారి పాలనలో ఇలాంటి పోటీలు ఎప్పుడైనా నిర్వహించారా అని ప్రశ్నించారు. యువత క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొని ఉత్తమంగా రాణించాలన్నారు. ప్రభుత్వం అందించిన క్రీడా సామగ్రిని ఎరిగేరి గ్రామంలో సర్పంచ్ గోవిందు, ఇన్‌చార్జి నీలకంఠరెడ్డి ఆధ్వర్యంలో క్రీడాకారులకు పంపిణీ చేశారు. బ్యాడ్మింటన్, క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్ పోటీలు నిర్వహించారు.వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు ప్రహ్లాదచారి, నాయకులు నాగరాజ్‌గౌడ్, బుజ్జిస్వామి, మహబూబ్‌సాబ్, పాల్‌దినకర్, తిక్కయ్య, ఎంపీడీఓ సుబ్బరాజు, ఎంఈఓ శోభరాణి తదితరులు పాల్గొన్నారు.

డీఈఈ కలిసిన ఏఐటీయూసీ నాయకులు

ఆదోనిరూరల్: ఆదోని డివిజన్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ (డీఈఈ)ని స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ ఆదోని డివిజన్ నూతన కమిటీ, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నంద్యాల జిల్లా అధ్యక్షులు బుధవారం స్థానిక కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. వారు మాట్లాడుతూ.. తాము గతంలో సీఐటీయూ అనుబంధ సంస్థలో సభ్యులుగా ఉండేవారమని, కాగా ప్రస్తుతం ఏఐటీయూసీలో చేరామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సురేష్, నవీన్, రాష్ట్ర వర్గసభ్యులు కల్యాణ చక్రవర్తి, నంద్యాల జిల్లా కార్యదర్శి రామకృష్ణ, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆదోని డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు, డివిజన్ కార్యదర్శి బి.రాణి, అధ్యక్షులు హెచ్.సత్యనారాయణ, కోశాధికారి సర్వరాజు, వైస్ ప్రెసిడెంట్‌లు బసవన్నగౌడ్, రత్నకుమార్, జాయింట్ సెక్రటరీ భాస్కర్, రాజు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని జింక మృతి



మృతి చెందిన జింక

పత్తికొండ రూరల్: పత్తికొండ–కోతిరాళ్ల ప్రధాన రోడ్డుపై బుధవారం వేగంగా వెళ్తున్న బైక్‌కు జింక అడ్డు అడ్డురావడంతో ఢీకొట్టగా జింక మృతిచెందింది. వివరాలు.. గోనెగండ్ల మండలం బండగట్టు గ్రామానికి చెందిన వెంకటేష్ పని నిమిత్తం పత్తికొండకు వస్తున్నాడు. కోతిరాళ్ల–కనకదిన్నె గ్రామాల మధ్యలో వెళుతుండగా జింక పరిగెత్తుతూ ఒక్కసారిగా బైక్‌కు అడ్డుగా వచ్చింది. బలంగా ఢీకొట్టడంతో జింక మృతి చెందింది. బైక్ అదుపుతప్పి కిందపడగా యువకుడికి తీవ్రగాయాలవగా పత్తికొండ ప్రభుత్వాసుపత్రికి తరలించగా ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

మెడికల్ కళాశాలను త్వరగా పూర్తి చేయాలి



మెడికల్ కళాశాల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కేంద్ర సహాయ మంత్రి సత్యపాల్‌సింగ్ బఘేల్

ఆదోనిఅర్బన్/ఆదోనిరూరల్: పట్టణ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కళాశాలను త్వరగా పూర్తి చేయాలని వైద్య, ఆరోగ్య కేంద్ర సహాయ మంత్రి సత్యపాల్‌సింగ్ బఘేల్ సూచించారు. బుధవారం మండలంలోని ఆరేకల్ గ్రామ సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న మెడికల్ కళాశాలను పరిశీలించి ఆవరణలో కలియతిరిగారు. ఆదోని సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మతో వివరాలను అడిగి తెలుసుకున్నారు. మంత్రి మాట్లాడుతూ నాబార్డు కింద మంజూరైన మెడికల్ కళాశాలకు కేంద్ర ప్రభుత్వం 65 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 35 శాతం నిధులు వెచ్చిస్తున్నాయని చెప్పారు. అనంతరం పట్టణంలోని ఆర్ట్స్ కళాశాల రోడ్డులో బీజేపీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. తదనంతరం పట్టణంలోని మాతాశిశు ఆసుపత్రిని పరిశీలించి వైద్యులు, సిబ్బందితో మాట్లాడి వైద్యులను ప్రశంసించారు.



ఆదోని మాతాశిశు ఆస్పత్రిలో వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి

రాత్రి పట్టణంలోనే బస చేశారు. గురువారం పట్టణ శివారులోని రణమండల కొండలోనున్న పురాతన కట్టడాలను పరిశీలిస్తారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ తెలిపారు. నాయకులు మలేకర శ్రీనివాసులు, నాగరాజుగౌడ్, శ్రీనివాస ఆచారి, వడ్డే శ్రీనివాసులు, సాయి పాల్గొన్నారు.

వేలంలో రూ.64 వేల ఆదాయం

కృష్ణగిరి: మండల కేంద్రం సమీపంలోని హంద్రీ – నీవా రిజర్వాయర్‌లో చేపల పెంపకం హక్కుల వేలం ద్వారా రూ.64 వేల ఆదాయం సమకూరినట్లు గాజులదిన్నె ప్రాజెక్టు మత్స్యశాఖ అధికారి చంద్రయ్య తెలిపారు. కృష్ణగిరిలోని సచివాలయంలో బుధవారం జరిగిన వేలం పాటలో తుగ్గలి మండలం ఆర్ఎస్ పెండేకల్లు గ్రామానికి చెందిన చాందుబాషా వేలం పాట దక్కించుకున్నట్లు వెల్లడించారు. ఈ ఏడాది జూన్ చివరి నాటికి ఈ వేలం పాట గడువు ముగుస్తుందని ఆయన తెలిపారు. పంచాయతీ కార్యదర్శి శ్రీధర్‌మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు సమాచారం ఇవ్వండి

వెల్దుర్తి(కృష్ణగిరి): సంక్రాంతి పండుగ, ఇతరత్రా సందర్భంగా ఇళ్లకు తాళాలు వేసి ఊర్లకు వెళ్లే వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించాల్సిందిగా ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. ఊర్లకు వెళ్లే వారు తమ నగదు, ఆభరణాలను బ్యాంకులో ఉంచి వెళ్లాలని, బైక్, కారు తదితరాలు పార్కింగ్, లాకింగ్ సేఫ్టీ పాటించి వెళ్లాలన్నారు. తమ గస్తీ కొనసాగుతూ ఉంటుందని, తాళాలు వేసి వెళ్లిన ఇళ్లు, దుకాణాల ప్రాంతాల్లో మరింత గస్తీ పెంచుతామన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో జేబుదొంగలు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో బుధవారం ఓ చానల్ రిపోర్టర్ బస్సు ఎక్కుతుండగా అతని జేబు నుంచి నగదును పిక్‌పాకెటర్ కొట్టేశాడు. స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన ఈరన్న కర్నూలు వెళ్లేందుకు బస్సు ఎక్కుతుండగా ప్యాంట్ వెనక జేబులో పెట్టుకున్న రూ.3,500 నగదును వెనక నుంచి గుంపులో వచ్చిన దొంగ కొట్టేశాడు. బస్సు ఎక్కి టికెట్ తీసుకునేందుకు జేబులో చూసుకోగా చోరీ జరిగినట్లు గ్రహించి బస్సు దిగి పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకొని బస్టాండ్‌లోని సీసీ కెమెరాల్లో నమోదైన రికార్డులను పరిశీలించాలని ఆర్టీసీ అధికారులను కోరగా పనిచేయడం లేదని చెప్పారు. దీంతో ఆ పరిసరాలను పరిశీలించి వెళ్లారు. పట్టణ పోలీసులు స్పందించి బస్టాండ్‌లో పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

ఆదోనిఅర్బన్: శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ చైర్మన్ రాయచోటి రామయ్య, రాయచోటి సుబ్బయ్య ఆధ్వర్యంలో బుధవారం మహాయోగి లక్ష్మమ్మవ్వ ఆధ్యాత్మిక కేంద్రంలో 8, 9, 10వ తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. మొత్తం 185 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. భీమారెడ్డి, పరమేష్, కృష్ణ, విష్ణువర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

ఎమ్మిగనూరురూరల్: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని రూరల్ సీఐ మోహన్‌రెడ్డి హెచ్చరించారు. ఆయన బుధవారం రాత్రి మండల పరిధిలోని ఫ్యాక్షన్ గ్రామం కోటేకల్‌లో పల్లెనిద్ర చేపట్టారు. గ్రామంలో ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ.. ఫ్యాక్షన్ గొడవలకు వెళ్లి కుటుంబాలు నాశనం చేసుకోవద్దని హితవుపలికారు. ప్రశాంత జీవనం సాగించాలని, పిల్లలను బాగా చదివించుకోవాలని సూచించారు. రాబోవు ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని పరిష్కరిస్తామని చెప్పారు. రాత్రి గ్రామంలోనే నిద్రించారు. రూరల్ ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



కోటేకల్‌లో మాట్లాడుతున్న సీఐ మోహన్‌రెడ్డి

జగనన్నతోనే సంక్షేమాభివృద్ధి కొనసాగింపు



మహిళతో మాట్లాడుతున్న మనోజ్‌కుమార్‌రెడ్డి

ఆదోనిరూరల్: సంక్షేమ పథకాలు, అభివృద్ధి కొనసాగాలంటే జగనన్నను మరోసారి సీఎంగా గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తనయుడు మనోజ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండిగిరి పంచాయతీ పరిధిలోని తిరుమలనగర్, బాబాగార్డెన్, మల్లికార్జున స్కూల్ ప్రాంతం, టీచర్స్ కాలనీ, బ్యాంకర్స్ కాలనీల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతి గడపకు తిరిగి పథకాల అమలు, లబ్ధిని వివరించారు. అలాగే సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ప్రతి పేద వాడిని లక్షాధికారిని చేయాలనే లక్ష్యంతో ఆర్థికంగా ప్రజలకు చేయూతనందించిన ఘనత జగనన్నకే దక్కిందన్నారు. వ్యాధుల చికిత్స పేరుతో పేదలు అప్పులపాలు కాకూడదని 3500 వ్యాధులను ఆరోగ్యశ్రీ కిందకు చేర్చడమే కాకుండా ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంచారని చెప్పారు. మరోసారి సీఎం జగనన్నను గెలిపించుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లుపోతుల సురేష్, వినోద్‌రెడ్డి, కోటిరెడ్డి, సురేష్, సన్నీ, శ్రీనివాసరెడ్డి, గుర్రెడ్డి లక్ష్మిరెడ్డి, ధనుంజయరెడ్డి, పాండురెడ్డి, కోటిరెడ్డి, చక్రి, దాసు, రఘునాథ్‌రెడ్డి, భీమిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మారెమ్మ దేవర



వెండి అలంకరణలో పూజలందుకుంటున్న దుర్గాదేవి

కోసిగి: మండలంలోని దుద్ది, కొల్మాన్‌పేట, జుమ్మాలదిన్నె గ్రామాల్లో గ్రామ దేవతలు మారెమ్మ, దేవమ్మ, పెద్దమ్మవ్వల దేవర ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. మంగళవారం రాత్రి నుంచే ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. గ్రామాల్లో కొలువున అమ్మవారి విగ్రహాలను పురవీధుల గుండా మేళతాళాలు డప్పువాయిద్యాలతో పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించి ఆలయంలో కొలువుంచారు. బుధవారం వేకువజామున నుంచి ఇంటింటా నైవేద్యాలు తయారు చేసి పూర్ణకుంభాలు, డప్పువాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయం చెంతకు చేరుకుని నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ పి.మురళీమోహన్ రెడ్డి ఆయా గ్రామాల్లో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఎంపీపీ ఈరన్న, నాయకులు నాడుగేని నరసింహులు, బెట్టన గౌడ, నాగేష్, రామలింగ తదితరులు అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

కౌతాళం: మండల పరిధిలోని గుడికంబాలి, కరణి, తిప్పలదొడ్డి గ్రామాల్లో దేవర మహోత్సవం బుధవారం కనుల పండువగా జరిగింది. ఆయా గ్రామాల్లో తెల్లవారుజామున 2 గంటలకు మేటి కుంభానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు దేవాలయంలో ఆకుపూజ, కుంకుమార్చన, ప్రత్యేక పూజలతో ఉత్సవం ప్రారంభించారు. భక్తులు కుంభాలతో తరలివచ్చి మారికాంబదేవి, దుర్గా దేవి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి ప్రారంభమైన కుంభోత్సవం సాయంత్రం వరకు కొనసాగింది. ఉత్సవాలను తిలకించేందుకు చుట్టుపక్కల నుంచి భక్తులు అధికంగా తరలివచ్చారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన నాయకుడు ప్రదీప్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. మండల కన్వీనర్ ప్రహ్లాదచారి, ఉరుకుంద ట్రస్టుబోర్డు చైర్మన్ నాగరాజ్‌గౌడ్, ఎంపీపీ అమరేష్, వైస్ ఎంపీపీ బుజ్జిస్వామి, తదితరులు పాల్గొన్నారు.



దుద్ది గ్రామంలో పూర్ణకుంభాలతో ఊరేగింపుగా వెళుతున్న భక్తులు



గుడికంబాలిలో భక్తుల కోలాహలం

వైద్యుల నిర్లక్ష్యంతోనే పసికందు మృతి



ఆదోనిలో ఓ ప్రైవేట్ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న బాధిత కుటుంబ సభ్యులు

ఆదోనిఅర్బన్: వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ పసికందు మృతి చెందాడని బోయగేరికి చెందిన పసికందు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు బుధవారం పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. పసికందు తల్లిదండ్రులు మహాలక్ష్మి, సురేష్ మాట్లాడుతూ మూడో కాన్పు కోసం మంగళవారం రెగ్యులర్ చెకప్ కోసం రాగా డాక్టర్‌లు చికిత్స చేశారన్నారు. సమస్య ఉందనడంతో మంగళవారం రాత్రి సిజేరియన్ చేశారని, దీంతో పసికందు మృతి చెందారని తెలిపారు. అయితే నెలలు కూడా పూర్తి కాలేదని, సీజేరియన్ చేయడం వల్ల గంట తర్వాత వైద్యుల నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు చనిపోయారని బుధవారం ఆసుపత్రి పెదుట ఆందోళన చేపట్టారు. సమస్యను తెలుసుకున్న టూటౌన్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఈ విషయంపై ఆసుపత్రి వైద్యురాలు భారతి దృష్టికి తీసుకెళ్లగా, పసికందు హార్ట్‌బీట్ సమస్య ఉండటంపై తల్లిదండ్రులకు తెలియజేశామని చెప్పారు. వారి అంగీకారంతోనే నిబంధనల మేరకు సీజేరియన్ చేశామని, ఇంతలోనే ఆ పసికందు చనిపోయిందని పేర్కొన్నారు.

ఆ పాఠశాలలపై చర్యలు తీసుకోండి



డీఈఓ రంగారెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఆర్‌పీవీఎఫ్ నాయకులు

ఆదోని సెంట్రల్: సెలవుల్లో తరగతులను నిర్వహించే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ (ఆర్‌పీవీఎఫ్) జిల్లా అధ్యక్షుడు కృష్ణ ఖాజా తెలిపారు. బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి రంగారెడ్డిని కలసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ పట్టణంలోని కొన్ని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలు ర్యాంకుల కోసం విద్యార్థులను మానసిక అందోళనకు గురిచేస్తున్నారని చెప్పారు. అధికారులు స్పందించి తక్షణమే తరగతులను నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

➡ సంక్రాంతి పండుగ దినాల్లో తరగతులను నిర్వహించడం తగదని ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు గౌస్ తెలిపారు. బుధవారం యూటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతేక తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.నాయకులు శశిధర్, నాగరాజు, గణేశ్, సురేష్, మహేశ్, పవన్, యశ్వంత్ పాల్గొన్నారు.

ప్రజల ముంగిటకే నాణ్యమైన వైద్యం



వైద్యసేవలపై ఆరా తీస్తున్న మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి

ఆదోనిటౌన్: ప్రజల ముంగిటకే నాణ్యమైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసిందని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలో 12వ వార్డు హవన్నపేట అర్బన్‌హెల్త్ సెంటర్, 32వ వార్డు హనుమాన్‌నగర్, బోయగేరి ప్రాంతాల్లోని అర్బన్‌హెల్త్ సెంటర్‌లలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలను నిర్వహించారు.వాటిని మున్సిపల్ కమిషనర్ ప్రారంభించి పేదలకు అందే వైద్యసేవలపై డాక్టర్లు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. బీపీ, షుగర్, రక్త పరీక్షలు, ఈసీజీ, కంటి జబ్బులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులను పరీక్షించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సూపర్‌వైజర్, ఏఎన్‌ఎంలు,, సిబ్బంది పాల్గొన్నారు. కాగా 12 వార్డులో 305 మంది ఓపీ, 275 మందికి షుగర్,బీపీ పరీక్షలు చేశారు.30 మంది చిన్నారులకు రక్త పరీక్షలు చేసి మందులు అందజేశారు. 32వ వార్డులో 258 మంది ఓపీ తీసుకోగా 180 మంది బీపీ, షుగర్ పరీక్షలు, 28 పిల్లలకు వైద్యసేవలందించారు. 37మందికి కంటి పరీక్షలు చేశారు.

రిజర్వాయర్‌లో చేపల పెంపకానికి వేలం



వేలం పాట నిర్వహిస్తున్న ఆదోని మత్స్యకార సహాయ పర్యవేక్షకులు నాగరాజు

కోసిగి: మండలకేంద్రం శివారులోని పులికనుమ రిజర్వాయర్‌లో చేపల పునరుత్పత్తి చేసేందుకు ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చాయి. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆదోని మత్స్యకార సహాయ పర్యవేక్షకులు నాగరాజు ఆధ్వర్యంలో చేపల పెంపకం హక్కులకు బహిరంగ వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేలంలో సర్కారు వారి పాట రూ.68,072 కాగా పులికనుమ గ్రామానికి చెందిన కె.తిక్కయ్య రూ.80వేలకు పాడి హక్కులను దక్కించుకున్నట్లు తెలిపారు. వేలం దక్కించుకున్న వారు సంవత్సరం పాటు రిజర్వాయర్‌లో చేపల పెంపకం చేయవచ్చన్నారు. విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్ చంద్రకళబాయి పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్టు

కృష్ణగిరి: మండల పరిధిలోని లాల్‌మాన్‌పల్లె గ్రామ శివారులో ఈద్గా వద్ద కర్ణాటక మద్యం కలిగి ఉన్న గ్రామానికి చెందిన ఉప్పరి మనోహర్‌ను బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఇతని వద్ద నుంచి 28 ఒరిజినల్ చాయిస్ విస్కీ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మండలంలో ఎక్కడైన అక్రమంగా మద్యం అమ్మితే తమకు సమాచారం అందించాలని కోరారు.